
చంద్రబాబుతో రోడ్‌షోలో విక్టరీతో అభివాదం తెలుపుతున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం సురేశ్‌నాయుడు












శనివారం మధ్యాహ్నం మండుటెండలో ప్రసంగిస్తున్న చంద్రబాబు నాయుడు.. హాజరైన జనం

ఆయన రాచముల్లు

- ప్రజల పాలిట ముల్లుగా మారిన రాచమల్లును ఓడించండి
- వ్యాపారులకు, ప్రజల ఆస్తుల రక్షణ బాధ్యత నాదే
- వరదరాజులరెడ్డిని గెలిపించండి..
- ప్రొద్దుటూరు దశ మార్చడానికి సహకరించండి
- ఎంపీగా.. బుల్లెట్ లాంటి భూపేశ్‌రెడ్డిని గెలిపించండి
- ప్రజాగళం రోడ్‌షోలో చంద్రబాబు నాయుడు

ప్రొద్దుటూరు, మార్చి 30: "ఆయన రాచమల్లు కాదు.. రాచముల్లు.. ప్రొద్దుటూరు ప్రజల పాలిట ముల్లుగా మారి అందరినీ గుచ్చుతావున్న రాచమల్లును ఓడించండి" అని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రొద్దుటూరు ప్రజలకు పిలుపునిచ్చారు.

శనివారం మధ్యాహ్నం ప్రొద్దుటూరులో ప్రజాగళం పేరిట శివాలయం సర్కిల్లో ఏర్పాటు చేసిన రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ రాచమల్లు సాగిస్తున్న ఇసుక, భూదందాలకు లెక్క ఉందా.. లెక్కకట్టే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. వీటిని గురించి నేనే మాట్లాడాలా. నేనే పోరాడాలనా అన్నారు. మట్కా క్రికెట్ బెట్టింగ్ గంజాయిలలో ఆయనకు వాటా ఉందాలేదా అని ప్రశ్నించారు.. జనం ఉంది ఉంది అని అరిచారు. బియ్యం మద్యం డీజల్ మాఫియాలో వాటాలు పొందుతున్నాడన్నారు. పోలీసు స్టేషన్లలో పంచాయితీలు, సెటిల్‌మెంట్లు చేస్తున్నాడన్నారు. హాట్సాఫ్ పోలీసులు మీకందరికీ.. ఇలాంటి సంఘవిద్రోహ శక్తులను పెంచి పోషించినందుకు సన్మానం చేయాలన్నారు. రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లంచాలు అవినీతి లేకుండా పనులు జరుగుతున్నాయా అని ప్రశ్నించారు. ఇవన్నీ కాదని నకిలీ నోట్లు కూడా ముద్రించారంటే ఏమి చెప్పాల్నో అర్థంకావడం లేదన్నారు. ఆఖరికి సీఎం రిలీఫ్ ఫండ్‌లో 131 కోట్ల రూపాయలు మీ పేర్లతో బొక్కేసిన ఘనుడు రాచమల్లు అన్నారు. వసూళ్లలో తన మన తేడా లేదన్నారు. అన్నింటికి ఫిక్స్‌డ్ రేట్లు పెట్టి మరీ వసూళ్లకు పాల్పడుతున్నాడన్నారు.

తేనెపూసిన కత్తి

బీసీలు ఎస్సీలు వైశ్యులు, మైనారిటీల ఆస్తులన్నింటికీ ఎసరు పెడుతున్నాడన్నారు. అనతి కాలంలోనే అప్పుల దశనుంచి రెండువేల కోట్ల ఆస్తులు కూడబెట్టుకుని అవినీతికి పాల్పడ్డారన్నారు. జగన్ అవినీతి లక్షల కోట్లు ఉంటుందన్నారు. పోస్టింగ్ ఏదైనా చదివించుకోవాల్సిందే అన్నారు. సేవల పేరుతో ఈ దొంగలు దానకర్ణుడి వేషమేసి వంద రూపాయలు దోచితే రెండు రూపాయలు ఖర్చు పెడతారన్నారు. మాటల గారడీతో మభ్యపెడతాడన్నారు. తేనె పూసిన కత్తిలాంటి వ్యక్తి రాచమల్లు అన్నారు. ఒకప్పుడు కౌన్సిలర్ కూడా కాలేకపోయాడన్నారు.

ఆర్ బీ కే దోపిడీని అరికట్టాలి

బీసీనేత నందం సుబ్బయ్య నీతి కోసం పోరాడినందుకు దారుణంగా చంపేశాడన్నారు. నా ప్రాణ సమానమైన నాయకుడిని పోగొట్టుకున్నందుకు ఆ కుటుంబానికి రూ. 20లక్షలు ఇచ్చి ఆదుకున్నామన్నారు. వారి పిల్లల బాధ్యతను తీసుకున్నామన్నారు. ఒంటిమిట్టలో వైసీపీ కార్యకర్తల దౌర్జన్యాలకు ఓ చేనేత కుటుంబం బలైపోయిందన్నారు. భార్య బిడ్డ విషం తాగి చనిపోతే.. అతను రైలుకింద పడి చనిపోయాడన్నారు. కనీసం సీఎం జగన్ ఖండించాడా అన్నారు. ప్రొద్దుటూరులో ఆర్ బీ కే దోపిడీ సాగుతోందన్నారు. ఆర్ అంటే రాచమల్లు.. బీ అంటే బంగారు రెడ్డి.. కే అంటే కిరణ్‌రెడ్డి అన్నారు. వీరి అరాచకాలను దుర్మార్గాలను ఓడించి వరదరాజుల రెడ్డిని గెలిపించుకోవాలన్నారు.

భూపేశ్‌ను గెలిపిస్తే స్టీలు ఫ్యాక్టరీ వస్తుంది

కడప ఎంపీగా బుల్లెట్‌లాంటి భూపేశ్‌రెడ్డిని గెలిపించాలని చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. బాబాయ్‌ని చంపినోన్ని ఎంపీగా నిలబెట్టి ఓట్లు ఎలా అడుగుతున్నావా నీకు సిగ్గులేదా జగన్ అని ప్రశ్నించారు. భూపేశ్‌ను గెలిపిస్తే స్టీలు ఫ్యాక్టరీ వస్తుందన్నారు. జిల్లాకు పరిశ్రమలు వస్తాయన్నారు. ప్రజలకు అండగా ఉంటాడన్నారు. దౌర్జన్యం చేస్తే కర్రపట్టుకోవడానికి సైతం నిలబడతాడన్నారు. మీ పిల్లల భవిష్యత్తుకోసం అనుభవం గల వరదరాజులరెడ్డిని, భవిష్యత్తువున్న భూపేశ్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రొద్దుటూరులో టీడీపీ కోసం కష్ట పడి జైలుకు కూడా వెళ్లిన ఇన్‌చార్జ్ ప్రవీణ్ రెడ్డికి పార్టీలో కచ్చితంగా పదవులు ఇచ్చి న్యాయం చేస్తామన్నారు. అలాగే సురేశ్‌నాయుడుకు, ఎమ్మెల్యే లింగారెడ్డికి సైతం న్యాయం చేస్తామన్నారు. మైనారిటీ నాయకుడైన ముక్తియార్‌కు పార్టీ అన్ని విధాల సాయం చేస్తుందన్నారు. అందరూ కలసి వరదరాజులరెడ్డిని గెలిపించుకోవాలన్నారు.

ప్రొద్దుటూరుకు చంద్రబాబు వరాల జల్లు

రాయలసీమలో వ్యాపారనగరంగా పేరొందిన ప్రొద్దుటూరు దశ దిశ మార్చడానికి చంద్రబాబునాయుడు వరాల జల్లు కురిపించారు. మీ వ్యాపారాలకు ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించే బాధ్యత తనదని అన్నారు. కుందూ పెన్నా కాలువ నిర్మాణంతో పాటు రాజోలి ఆనకట్ట నిర్మాణంపై శ్రద్ధపెడతానన్నారు. ప్రొద్దుటూరులో మురుగునీటి వ్యవస్థ ప్రక్షాళన చేపట్టి డ్రైనేజీ వ్యవస్థకు రూపకల్పన చేస్తామన్నారు. 350 పడకల జిల్లా ఆసుపత్రిలో డాక్టర్లు కూడా లేరన్నారు. ఈ ఆసుపత్రిలో మెడికల్ కాలేజీ పెట్టి అభివృద్ధి పరుస్తామన్నారు. అపెరల్ ఫ్యాక్టరీ పెడతామన్నారు. స్టీలు ఫ్యాక్టరీ పూర్తి చేస్తామన్నారు. ఐటీ పార్కును సైతం తెస్తామన్నారు. ఇవన్నీ చేపడితే రాయలసీమలోనే పెద్ద నగరంగా ప్రొద్దుటూరు దిశ మారుతుంది దశ తిరుగుతుందన్నారు.


చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

హెలిపాడ్ వద్ద నేతల స్వాగతం

ప్రొద్దుటూరులో ఏర్పాటు చేసిన ప్రజాగళం రోడ్‌షోలో పాల్గొనడానికి వచ్చిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు ఆర్టీవో ఆఫీసు సమీపంలోని హెలిపాడ్ వద్ద జిల్లా టీడీపీ నేతలు స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డి, జగన్మోహన్‌రాజు, కడప, కమలాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరు, పులివెందుల, రాజంపేట అభ్యర్థులు మాధవరెడ్డి, క్రిష్ణచైతన్యరెడ్డి, నంద్యాల వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, బీటెక్ రవి, సుగవాసి బాలసుబ్రమణ్యం, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు సీఎం సురేశ్‌నాయుడు, గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్సీలు పుత్తా నరసింహారెడ్డి, బచ్చలపుల్లయ్య, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నేతలు నంద్యాల కొండారెడ్డి, రితీశ్‌రెడ్డి, ఆనం రఘురామిరెడ్డి, వీఎస్ ముక్తియార్, ఈవీ సుధాకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, తోట మహేశ్వరరెడ్డి, బచ్చల ప్రతాప్, ఘంటశాల వెంకటేశ్వర్లు, అమీర్‌బాబు, లక్ష్మీరెడ్డి, మన్మోహన్‌రెడ్డి, జీఎన్ నాయుడు, పీరయ్య, రాంప్రసాద్, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణు తదితరులు ఉన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ప్రముఖులు

మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు వైసీపీ సీనియర్ నాయకుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, వైసీపీ పట్టణ అధ్యక్షుడు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్యవైశ్య ప్రముఖులు కామిశెట్టి బాబు, వైసీపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ ప్రస్తుత 5 వవార్డు కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి, కొత్తపల్లె ఎంపీటీసీ సౌభాగ్యమ్మ, టంగుటూరు మాజీ ఎంపీటీసీ మహబూబ్ బాషా టీడీపీలో చేరారు. వీరందరికి చంద్రబాబు నాయుడు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వైసీపీ అరాచక పాలనను సాగనంపుదాం ..

రాష్ట్రంలో వైసీపీ అరాచకపాలనను సాగనంపడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారు. చిన్నవయస్సులో నాకు ఎంపీగా పోటీ చేసేందుకు చంద్రబాబు నాయుడు అవకాశమిచ్చారు. ఆ బాధ్యతను నెరవేర్చేందుకు నాశక్తి వంచనలేకుండా పనిచేస్తా. వైసీపీ ప్రభుత్వంలో ఇంజీరింగ్ చదివిన వారికి 5వేలతో వలంటీర్ ఉద్యోగాలు ఇచ్చి ఉద్యోగాల కల్పన చేశానని ప్రచారం చేసుకుంటురు. విజన్‌వున్న నాయకుడుగా రాష్ట్రానికి పెద్దకొడుకుగా ఉన్న చంద్రబాబునాయుడు ఉద్యోగాలు సృష్టించగలరు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని యువగళంలో నారా లోకేశ్ కూడా హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో నిరుద్యోగులు రైతులు ప్రభుత్వ ఉద్యోగులు మోసపోయారు. వారందరికీ న్యాయం జరగాలంటే టీడీపీ ప్రభుత్వం రావాలి.

- చదిపిరాళ్ల భూపేశ్ రెడ్డి, కడప ఎంపీ అభ్యర్థి

ప్రజల ఆస్తులకు భద్రత కల్పిస్తాం..

సీఎం జగన్ ప్రొద్దుటూరులో రూ.516 కోట్ల పథకాలకు శిలాఫలకాలు వేసి ఒక్కపైసా బిల్లులు ఇవ్వలేదు. ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి శ్మశానాలు దేవాలయాలు పునరుద్ధరిస్తామని చెప్పి దేవాలయ భూములను ఆక్రమించాడు. ఎమ్మెల్యే, ఆయన బావమరిది అవినీతి గురించి మాట్లాడారని పట్టపగలే వందలాది మంది సమక్షంలో బీసీ నేత నందం సుబ్బయ్యను నరికి చంపారు. ఎస్సీ బీసీలకు న్యాయం జరగకపోగ వారిపై దమనకాండ జరుగుతోంది. దుర్మార్గుడైన రాచమల్లును ఓడించి టీడీపీని గెలిపిస్తే జూదరహిత ప్రొద్దుటూరుగా మార్చుతామన్నారు. ప్రజల ఆస్తులకు వ్యాపారులకు భద్రత కల్పిస్తాం. ప్రొద్దుటూరు ప్రజలు గుండెలపై చేయివేసుకుని ప్రశాంతంగా నిద్రపోయేలా మార్చుతాం.

- నంద్యాల వరదరాజులరెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే అభ్యర్థి

జనం డిసైడయ్యారు..!

జనం డిసైడై పోయారు.. వచ్చే ఎన్నికల్లో ఎవరిని గెలిపించాలో.. ఎవరిని ఇంటికి పంపాలో ఇప్పటికే నిర్ణయించేసుకున్నారు. మూడు రోజుల వ్యవధిలో ప్రొద్దుటూరులో వైసీపీ, టీడీపీ అధ్యక్షులు నిర్వహించిన కార్యక్రమానికి జనం స్పందన చూస్తే ఇది స్పష్టంగా తెలిసిపోతుంది. ఈ నెల 27వ తేదీన 'మేమంతా సిద్ధం' అంటూ సాయంత్రం చల్లనివేళలో జగన్ సభ జరిగింది. దీనికి హాజరైన జనం జగన్ ప్రసంగం మొదలు పెట్టగానే ఇంటిదారి పట్టారు. ఆయన ప్రసంగం పూర్తయ్యే సరికి సభ గ్యాలరీలన్నీ దాదాపు ఖాళీగా వెక్కిరించాయి. ఇక శనివారం ప్రజాగళం పేరిట చంద్రబాబు రోడ్ షో మిట్ట మధ్యాహ్నం మంచి ఎండలో నిర్వహించారు. అయినా జనం రెండుగంటలకు పైగా ఆయన కోసం ఎదురుచూసి.. గంటకు పైగా చంద్రబాబు ప్రసంగాన్ని శ్రద్ధగా విన్నారు. దీన్ని చూసి రాజకీయ విశ్లేషకులు 'జనం ఎవరిని గెలిపించాలో ఇప్పటికే డిసైడ్ అయిపోయారు' అని అంటున్నారు.

- చల్లని సాయంత్రం వేళ.. 'మేమంతా సిద్ధం' పేరిట జగన్ సభ
- మండుటెండలో.. ప్రజాగళం వినిపించిన చంద్రబాబు
- జగన్ సభలో జనం జంప్
- చంద్రబాబు రోడ్‌షోలో ఎండను లెక్కచేయని జనం
- ప్రొద్దుటూరులో నాలుగురోజుల వ్యవధిలో రెండు సభల తీరు

(కడప-ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సీఎం వైఎస్ జగన్ కుటుంబం సొంత గడ్డ. టీడీపీ ఆవిర్భావం నుంచి 1999 ఎన్నికల వరకు ఉమ్మడి జిల్లాలో సత్తా చాటింది. 2004లో వైఎస్ సీఎం అయిన తరువాత కాంగ్రెస్ అడ్డాగా మారింది. జగన్ పార్టీ పెట్టిన తరువాత 2014లో 9స్థానాలు, 2019లో ఉమ్మడి జిల్లాలోని అన్ని స్థానాల్లోనూ వైసీపీ విజయం సాధించింది. జగన్ సీఎం అయిన తరువాత జిల్లా జనాల్లో మార్పు వస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పులివెందుల నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన రామగోపాల్‌రెడ్డి గెలిచారు. అది వైసీపీకి పెద్ద మైనస్. పైదంతా పక్కన బెట్టేస్తే నాలుగురోజుల వ్యవధిలో జిల్లాలో అదీ ఒకే ఊరిలో ప్రొద్దుటూరులో నిర్వహించిన జగన్, చంద్రబాబు సభలను చూస్తే జనాభిప్రాయం వేరుగా ఉంది.

చల్లని సాయంత్రం.. జగన్ సభ అలా

రాష్ట్రవ్యాప్తంగా 21 రోజుల ఎన్నికల ప్రచారానికి సీఎం జగన్ 'మేమంతా సిద్ధం' పేరుతో బస్సుయాత్రకు సిద్ధమయ్యారు. 27వ తేదీన ఇడుపులపాయలో తండ్రి వైఎస్‌కు నివాళులర్పించి బస్సుయాత్రకు శ్రీకారం చుట్టారు. ఇడుపులపాయకు ఉమ్మడి జిల్లా నుంచే కాదు.. పొరుగు జిల్లాల నుంచి భారీగా జనాలను తీసుకువచ్చారు. అయితే ఇడుపులపాయలోని జనం, వేంపల్లె బైపాస్‌కు వచ్చేసరికి అదృశ్యమయ్యారు. ప్రొద్దుటూరులో సభకు ఉమ్మడి జిల్లాతో పాటు పక్కనున్న నంద్యాల, అనంతపురం జిల్లాల నుంచి కూడా భారీగా జన సమీకరణ చేశారు. అది కూడా సభ సాయంత్రం పూటే. ఊరి బయట చల్లటి గాలులు వీచే ప్రాంతం. జగన్ ఫస్టుమీటింగ్ కావడంతో కనీవినీ ఎరుగని రీతిలో ఈ సభ సక్సెస్ చేయాలని భావించారు. ప్రతి ఊరికి ఆర్టీసీ బస్సులను పంపించారు. ఇక మీటింగ్‌కు వచ్చే జనాలకు రూ.600, మందు, బిరియాని ఇచ్చారని ప్రచారం సాగింది. జగన్ సభ వద్దకు వచ్చేసరికి జనం కొందరు వెళ్లిపోయారు. ఇక ప్రసంగం మొదలైన తరువాత దాదాపు జనం అంతా జంప్ అయ్యారు. అప్పటికీ పోలీసులు అడ్డుపడినా కూడా ఆగలేదు.


మూడు రోజుల క్రితం ప్రొద్దుటూరులో జరిగిన సభలో సీఎం జగన్ మాట్లాడుతుండగా ఖాళీగా ఉన్న గ్యాలరీలు

మండుటెండలో.. చంద్రబాబు రోడ్‌షో ఇలా

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రజాగళం పేరిట ప్రొద్దుటూరులో శనివారం రోడ్ షో నిర్వహించారు. రెండుగంటలు ఆలస్యంగా 12.03కు రోడ్‌షో జరిగే ప్రాంతానికి వచ్చారు. శనివారం ఎండ తీవ్రంగా కాసింది. చంద్రబాబు ప్రసంగం మిట్టమధ్యాహ్నం కరెక్టుగా 12.15కు మొదలైంది. దాదాపు గంట 20 నిమిషాలు మాట్లాడారు. వాతావరణశాఖ ప్రకారం ప్రొద్దుటూరులో ఎండలే కాదు వడగాల్పులు కూడా ఉన్నాయి. అప్పటికే రెండుగంటలుగా వేచి ఉన్న జనం మండుటెండను తట్టుకుని చంద్రబాబు ప్రసంగాన్ని ఆసాంతం ఆలకించారు. సభకు వచ్చిన వారిలో చివరి వరకు దాదాపు 70శాతం మంది ఉన్నారు. మరి కొందరు నిప్పులు కక్కే ఎండను తట్టుకోలేక పక్కనున్న నీడలోకి చేరుకున్నారు. సీఎం జగన్ కడప జిల్లాకు ఏం చేశారు. స్టీలు ఫ్యాక్టరీకి రెండుసార్లు శంకుస్థాపనలు చేశారు. అదే నేనే సీఎం అయి ఉండింటే ఈసరికి స్టీలు ఫ్యాక్టరీ ప్రారంభం అయి ఉండేది అని చంద్రబాబు అన్నారు. కియో మోటారుకు నేనే శంకుస్థాపన చేశా, నేనే ప్రారంభించా. అదీ మన బ్రాండ్.. అంటూ చంద్రబాబు చెప్పడంతో జనాల్లో మంచి స్పందన వచ్చింది. వైసీపీ తొలి ఎన్నికల సభలో జగన్ మాత్రం స్టీలు ఫ్యాక్టరీ ఊసే ఎత్తలేదు. జగన్ సొంత గడ్డలో అదీ మిట్టమధ్యాహ్నం వేళ చంద్రబాబుకు జనం నీరాజనాలు పట్టడం వైసీపీలో ఆందోళన పెంచగా.. టీడీపీలో ఊపు తెచ్చింది.

పుష్పగిరి క్షేత్రంలో హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మన్



జస్టిస్ సీతారామమూర్తి శర్మను సన్మానిస్తున్న అర్చకులు

వల్లూరు, మార్చి 30 : ప్రసిద్ధిగాంచిన పుష్పగిరిని స్టేట్ హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మన్ జస్టిస్ సీతారామ మూర్తి శర్మ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వాములను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆయనను ఆలయ అధికారులు సన్మానించారు. ఆలయ అర్చకుడు సుమన్ దీక్షితులు పుష్పగిరి చరిత్రను తెలియజేశారు. వీరివెంట తహసీల్దారు అమర్‌నాథ్, ఆలయ సిబ్బంది ఉన్నారు.

సంగమేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు



హుండీలోని కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

వీరపునాయునిపల్లె, మార్చి 31: మండల పరిధిలోని సంగమేశ్వర ఆలయంలో శనివారం ఆలయ చైర్మన్ శివాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. శనివారం లెక్కించిన ఈ హుండీలలో రూ.3,80,100 ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ శివాంజనేయరెడ్డి, ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాలక మండల సభ్యులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేలు విరాళం



అన్నదాన పథకానికి విరాళం అందిస్తున్న భక్తులు

చక్రాయపేట, మార్చి 30: గండి క్షేత్రంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రూ.50వేలు విరాళం అందించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. శనివారం పులివెందులకు చెందిన ఎడుగూరి శ్రీనివాస రెడ్డి ధర్మపత్ని స్వర్ణలత వారి కుటుంబ సభ్యులు రూ.25,116, వివిధ భక్తుల నుంచి వచ్చిన మొత్తం కలిపి రూ.50వేలు విరాళం వచ్చినట్లు తెలిపారు.

ఉత్తర్వులు లేనిదే నిర్మాణాలు చేయరాదు

బ్రహ్మంగారిమఠం, మార్చి 30 : బ్రహ్మంగారిమఠం మండలంలోని పలు ప్రభుత్వ భూముల్లో ఉత్తర్వులు లేనిదే కట్టడాలు కట్టరాదని నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం దగ్గరలో ఉన్న సర్వేనెం.425, 426/2లో నాలుగు ఎకరాల్లో నిర్మాణాలు చేయడానికి స్థానిక పంచాయతీ అధికారులు అప్రూవల్ ఇవ్వాలన్నారు. రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో అనుమతులు ఇచ్చినప్పుడే కట్టడాలు చేపట్టాలని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. శనివారం సర్వే నెం.426లో నిర్మాణ పనులను రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. స్థలం యజమానులు తహసీల్దారు కార్యాలయానికి పిలిపించి రెవెన్యూ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినప్పుడే మీరు కట్టడాలు చేపట్టాలన్నారు. అంతవరకు ఆ స్థలంలో ఎవరే కానీ కట్టడాలను చేపట్టరాదని తహసీల్దారు తెలిపారు.

శ్మశానంలో షెల్టరు కూల్చివేత.. గ్రామస్తుల ఆందోళన

బద్వేలు రూరల్, మార్చి 30 : మండల పరిధిలోని శివరామనగర్, శ్రీనివాసనగర్ గ్రామాలకు చెందిన శ్మశానం విషయంలో ఏర్పడిన వివాదంతో శనివారం రెండు గ్రామాలకు చెందిన ప్రజలు రోడ్డు దిగ్బంధం చేసి ఆందోళనకు దిగారు. స్థానిక శ్రీనివాసనగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఇటీవల మరణించడంతో అతనిని స్థానిక శ్మశానంలో దహనం చేశారు. ఆ ప్రాంతంలో ఓ షెల్టరు ఏర్పాటు చేసేందుకు అతని కుమారులు ప్రయత్నాలు చేశారు. దీనికి రెండు గ్రామాల ప్రజలు ఒప్పుకోకపోవడంతో కొద్దిరోజులుగా వివాదం సాగుతోంది. శనివారం శ్మశానంలో ఉన్న షెల్టరును కూల్చివేయడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీంతో రూరల్ పోలీసులు, రెవెన్యూ అధికారులు వెళ్లి గ్రామస్థులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

చౌడేశ్వరి ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి దేవి

వల్లూరు, మార్చి 30 : మండలంలోని వెంకటాపురం వీవర్స్‌కాలనీలో శనివారం చౌడేశ్వరి జ్యోతి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామునే ఆలయంలో పూజలు చేశారు. ఉదయం గ్రామం లో చల్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సరిహద్దుల్లో గ్రామ దేవతలకు పూజలు చేశారు. అమ్మవారికి జలాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కాయ కర్పూరాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. . సాయంత్రం బిందె సేవ నిర్వహించారు. గ్రామంలోని గంగమ్మ ఆలయం వద్దకు మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవంగా వెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం గంగకు పూజలు నిర్వహించి బిందెలతో నీటిని చౌడేశ్వరి మాత ఆలయానికి చేరుకున్నారు.

చీనీ తోటలకు బంక తెగులు

● దిగుబడిపై తీవ్ర ప్రభావం ● ఆందోళనలో రైతులు



కాయలతో ఉన్న చీనీ తోట (ఇన్‌సర్ట్) బంక తెగులుతో వాడిపోయిన చీనీ చెట్టు

ముద్దనూరు మార్చి 30: చీనీ తోటలకు తెగులు సోకింది. బంక కారి చెట్లు వాడిపోతున్నాయి సీజన్‌లో తెగులు సోకడంతో దిగుబడి తగ్గి, నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చీనీ రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో కొర్రపాడు, గంగాదేవిపల్లె, ఓబులాపురం, మంగపట్నం చీనీతోటలకు పెట్టింది పేరు. దాదాపు 2వేల ఎకరాల్లో ఈ గ్రామాల్లో చీనీ తోటలు సాగు చేస్తున్నారు. గండికోట ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌కు సమీపంలో గ్రామాలు ఉన్నాయి. ప్రాజెక్టులో నీటి నిల్వ తగ్గిపోవడంతో బోర్లల్లో నీరు అంతంతమాత్రంగానే వస్తోంది. దానికి తోడు చీనీ చెట్లకు బంక తెగులు సోకడంతో వాడిపోతున్నాయి. ఆరు నుంచి 15 ఏళ్ల చరాల చెట్లు తెగులును తట్టుకోలేకపోతున్నాయి. దీంతో దిగుబడి కూడా తగ్గిపోయి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెట్లు చనిపోతున్నాయి



తెగులు విపరీతంగా ఉంది. బంక కారి చెట్లు వాడిపోయి, చనిపోతోంది. నాకు దాదాపు 15 ఏళ్లలోపు చెట్లు 300 ఉన్నాయి. వాటిలో 30 చెట్లు బంకకారి ఎండిపోయాయి. ఎన్ని మందులు వేసినా ఫలితంలేదు. కాయలు వస్తున్న సమయంలో తీవ్రంగా నష్టపోతున్నాం.

- కేశవరెడ్డి, చీనీ రైతు, గంగాదేవిపల్లె

వర్షం రావాల్సిందే..

ముద్దనూరు, తొండూరు మండలాల్లో చీనీ చెట్లకు తెగులు సోకింది. ఎండ తీవ్రతతోపాటు, భూమిలో వేడి ఎక్కువగా ఉండటం, నీటి శాతం తగ్గిపోవడంతో బంక తెగులు సోకింది. ఒక్క వర్షం పడితే చెట్లు కోలుకునే పరిస్థితి ఉంటుంది. వర్షం పడకుంటే చెట్లను కాపాడటం కష్టం.

- మల్లేశ్వరరెడ్డి, ఉద్యానశాఖాధికారి, ముద్దనూరు

లింగ నిర్ధారణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

● మాతృమరణాలపై డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య సమీక్ష



మాతృమరణాలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య

రాయచోటిటౌన్, మార్చి 30: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడంతో పాటు మాతృ మరణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య ఆదేశించారు. శనివారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం, మాతృ మరణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రిజిస్టరైన 117 స్కానింగ్ సెంటర్లలో గర్భిణు స్కానింగ్, ఆసుపత్రిలో జరిగే గర్భస్రావాల రిపోర్టులను తప్పనిసరిగా ప్రతి నెల 2వ తేదీలోగా రాయచోటిలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయానికి పంపాలన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జైలు శిక్షలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా జిల్లాలో పెద్దమండెం, కంబకూరు, నందలూరు, రాజంపేట, ఈడిగపాలెం మండలాల్లో జరిగిన మాతృ మరణాలకు కారణాలు, మరణాల నియంత్రణకు ఏ విధంగా చర్యలు తీసుకోవాలనే అంశాలపై కమిటీ సభ్యులు డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ వెంకటశివ, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ జీనత్‌బేగం, డాక్టర్ డేవిడ్ సుకుమార్‌తో చర్చించారు. గర్భిణుల వివరాలు నమోదు చేయడం, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న గర్భిణులను గుర్తించి తగిన ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. ఆయుష్మాన్ భారత్, బేటీ బచావో, బేటీ పడావో, సేవ్ ద గర్ల్ చైల్డ్ పథకాలపై అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే తల్లులకు గర్భిణులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, 102 వాహన నిర్వహణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు తుది అవకాశం

● బదిలీ, దిద్దుబాటుకు సైతం చాన్స్
● రానున్న ఎన్నికల్లో ఓటేసేందుకు అవకాశం
● ఏప్రిల్ 15 వరకు గడువు

పులివెందుల టౌన్, మార్చి 30: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడులైన నేపథ్యంలో పాలకులను ఎన్నుకునేందుకు ఓటర్లంతా సన్నద్ధమవుతున్నారు. ఈ తరుణంలో ఓటరకు తన ఓటు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలి, లేకుంటే వెంటనే నమోదు చేసుకోవాలి. దీని కోసం ఎన్నికల సంఘం 15వ తేదీ వరకు తుది గడువు పొడిగించింది. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నామినేషన్ల ప్రక్రియ ముగింపునకు పది రోజుల నాటికి వచ్చిన ఓటరు నమోదు దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి ఎన్నికల్లో ఓటు వేసేందుకు అవకాశం కల్పించాల్సి ఉంది. పులివెందుల నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన నేతలు గతంలో ఓటు మార్పులు, చేర్పులపై ఫిర్యాదులు చేయడం జరిగింది. ఫారం-7 ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఓటర్లను గుర్తించాలని ఫిర్యాదులు చేశారు. ప్రస్తుతం ఎన్నికల సంఘం విడుదల చేసిన జాబితాలో ప్రజలు తమ పేరును పరిశీలించుకొని తమ ఓటు లేని పక్షంలో వెంటనే దరఖాస్తు చేసుకుంటే ఓటు హక్కు కల్పిస్తారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో సైతం దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు చేసుకోవడం ఎలా?

ఓటరు నమోదు, ఓటు బదిలీ, వివరాల దిద్దుబాటు తదితర సేవల కోసం కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ఓటర్స్.ఈసీఐ.జీవోవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకొని కూడా ఈ సేవలను పొందవచ్చు. స్థానిక బూత్ స్థాయి అధికారి, బీఎల్‌ఓ, ఓటరు నమోదు, అధికారులకు దరఖాస్తులను అందజేయాలి. ఓటరు నమోదు కోసం కొత్తగా దిగిన ఫోటోతో పాటు చిరునామా, వయసు, ధృవీకరణ కోసం 10వ తరగతి మార్కుల జాబితా ఆధార్, రేషన్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌బుక్కులు, విద్యుత్ బిల్లులు సైతం సమర్పించాలి. ఓటరు జాబితాలో పేరు ఉందా లేదా అనేది తెలుసుకునేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఎలక్టోరల్ సెర్చ్.ఈసీఐ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను నిర్వహిస్తుంది. ఓటరు వివరాలు, గుర్తింపు కార్డు, మొబైల్ నెంబర్ ఆధారంగా జాబితాలో పేరును సెర్చ్ చేయడానికి ఈ పోర్టల్ అవకాశం కల్పిస్తుంది.

వివాదాస్పద, ఫేక్ న్యూస్ పోస్ట్ చేస్తే ఐదేళ్లు జైలు శిక్ష

● సోషల్ మీడియాలో పోస్టులకు అడ్మిన్‌దే బాధ్యత

కడప(కలెక్టరేట్), మార్చి 30: అడిగే వారు లేరని, ఏదో ఒక పార్టీకి అనుకూలంగా గ్రూపుల్లో, సోషల్ మీడియాలో పెట్టే ప్రతి పోస్టుకు అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం హెచ్చరించింది. వివాదాస్పద పోస్టులు క్షుణ్ణంగా పరిశీలించిన మీదటే ప్రచురించుకోవాలి. నిబంధనలకు వ్యతిరేకంగా వివాదాస్పదంగా, ఫేక్ న్యూస్‌లు పెట్టి, గ్రూపుల్లో షేర్ చేసే వ్యక్తులతో పాటు, అడ్మిన్‌ను నేరస్తుడిగా పరిగణించి ఐదేళ్లు జైలు శిక్ష విధించేలా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసింది. వివాదాస్పద పోస్టులు పెట్టే వారిపై ఐపీసీ సెక్షన్ 1534 కింద ఐదేళ్ల జైలు శిక్ష తప్పదు. విద్వేషాలు రెచ్చగొట్టే, వర్గపోరుకు దారి తీసే, దేశ భద్రతకు ముప్పు కల్గించే సందేశాలు, అంశాలను గ్రూపుల్లో పెట్ట రాదు. అవాస్తవ కథనాలు, మార్ఫింగ్ చేసిన ఫొటోలు, వీడియోలు, వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు, పోర్న్ క్లిప్స్, వీడియోలు ఇతర గ్రూపులకు, వ్యక్తులకు షేర్ చేస్తే ఎన్నికల సంఘం కఠినంగా వ్యవహరించనుంది.

నిర్లక్ష్యం నీడలో గ్రామ పంచాయతీ కార్యాలయం

● ఆక్రమణబారిన ప్రభుత్వ స్థలం ● ఫిర్యాదు చేసినా.. పట్టించుకోని అధికారులు



అంబవరం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా కంపచెట్లు




గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వేసిన గడ్డివాములు

జమ్మలమడుగు, మార్చి 30: ప్రభుత్వ భవనాలు దుర్వినియోగమవుతున్నా, అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జమ్మల మడుగు ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. జమ్మలమడుగు మండలంలోని ముద్దనూరు రోడ్డులో కొత్త రోడ్డు సున్నపురాళ్లపల్లెకు వెళ్లే దారిపక్కనే అంబవరం గ్రామ పంచాయతీ కార్యాలయం ఉంది. ఆ భవనానికి వెళ్లే దారిని అధికారపార్టీకి చెందిన ఓ కార్యకర్త దౌర్జన్యంగా ఆక్రమించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో సుమారు రెండేళ్లుగా గ్రామ పంచాయతీ కార్యాలయం మూతపడింది. దీంతో పరిసరాల్లో కంపచెట్లు పెరిగాయి. దీంతో ఆ వ్యక్తి భవనానికి ఒకవైపు గడ్డివామి వేసి, గేదెలను కట్టివేసి ఆ స్థలాన్ని ఆక్రమించుకున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకే రక్షణ లేకుండా పోవడంతో ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అంబవరం గ్రామ పంచాయతీ సెక్రటరీ అరుణ్‌ను వివరణ కోరగా తాము అప్పట్లో పనిచేసిన రెవెన్యూ అధికారి మధుసూదన్‌రెడ్డికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇదే సమస్యను ప్రస్తుతం జమ్మలమడుగు తహసీల్దారు కరుణాకర్ దృష్టికి తీసుకెళ్లగా తాను కొత్తగా వచ్చానని, త్వరలో పరిశీలిస్తానన్నారు.

ఆర్థిక శాస్త్రంతో ఉజ్వల భవిష్యత్

● 40వ రాష్ట్ర స్థాయి సదస్సులో వక్తలు



సదస్సు ప్రారంభిస్తున్న మోహన్‌రావు తదితరులు

మదనపల్లె టౌన్, మార్చి 30: నేటి సమాజంలో ఇంజినీరింగ్, సైన్సుతో పాటు ఆర్థికశాస్త్రంతో ఉజ్వల భవిష్యత్ ఉందని ఏఈ ఎకనామిక్ అసోసియేషన్ చైర్మన్ మోహన్‌రావు పేర్కొన్నారు. శనివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ఏపీ ఎకనామిక్ అసోసియేషన్ 40వ రాష్ట్ర సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ పెట్టుబడి, ఉత్పత్తి, మార్కెటింగ్ విక్రయాలు అనే నాలుగు అంశాలు ఆర్థికశాస్త్రం పరిధిలో వస్తాయని వాటిపై డిగ్రీ స్థాయిలోనే విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ మాజీ డైరెక్టర్ హరినారాయణ మాట్లాడుతూ మానవునికి అందుబాటులో వున్న వనరులను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఎస్వీ యూ మాజీ రిజిస్ట్రార్ దేవరాజులు మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్య కు 22నుంచి 25 శాతం బడ్జెట్ కేటాయించాలన్నారు. అనంతరం 50 డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీల నుంచి వచ్చిన ఎకనమిక్స్ ప్రొఫెసర్లు పేపర్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమలో కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, అధ్యాపకులు శివరామయ్య, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశాల్లో విశ్వం విద్యార్థుల హవా



సైనిక్ స్కూల్లో ప్రవేశాలు సాధించిన విశ్వం విద్యార్థినులు

తిరుపతి(విద్య), మార్చి 30: బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశాల్లో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని విశ్వం విద్యా సంస్థల అధినేత ఎన్. విశ్వనాథ రెడ్డి తెలిపారు. బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయని, విశ్వంలో శిక్షణ పొందిన వంశితశ్రీ, మనోజ్ఞబాయి, సోనిక, దర్శిణిశ్రీ, నిత్యశ్రీ, వర్షిణి సైనిక్ స్కూల్ ప్రవేశం సాధించారన్నారు. జాతీయ స్థాయిలో అత్యధిక మార్కులు, ఉత్తమ ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎన్.తులసి విశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి అభినందించారు.

సరిహద్దు చెక్‌పోస్టులో తనిఖీలు

పెద్దతిప్పసముద్రం మార్చి 30 : కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టులను శనివారం జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఈఎస్ వి. శ్రీనివాస్ తనిఖీ చేశారు. అంకాల మడుగు చెక్‌పోస్టును మొలకలచెరువు ఎస్ఈబీ సీఐ రామ్మోహన్‌తో కలసి తనిఖీ చేశారు. కర్ణాటక నుంచి అక్రమంగా డబ్బులు, మద్యం లాంటివి తరలించకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

ఏసీబీ వలలో వీఆర్వో

● మ్యుటేషన్ ఆమోదం కోసం లంచం డిమాండ్ ● రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత



వీఆర్వో యల్లయ్య

పీలేరు, మార్చి 30: కేవీపల్లె మండలంలో ఓ రైతుకు సంబంధించిన మ్యుటేషన్ వ్యవహారంలో లంచం తీసుకుంటున్న వీఆర్వోను ఏసీబీ అధికారులు శనివారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ కడప డీఎస్పీ గిరిధర్ కథనం మేరకు... కేవీపల్లె మండలం గోరంట్లపల్లె పంచాయతీ బసిరెడ్డిగారిపల్లె వడ్డిపల్లెకు చెందిన రైతు మల్లయ్య భూమికి సంబంధించిన రికార్డుల్లో తప్పులు దొర్లాయి. వాటిని సరిదిద్దేందుకు గత నెలలో మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఆయన భూమి అదే గ్రామానికి చెందిన మూడు సర్వే నెంబర్లలో ఉండడం, వాటిలో రెండు సర్వే నెంబర్లలో ఆయన భూమి దరఖాస్తు పట్టాగా నమోదు కావడంతో దానిని మార్చేందుకు మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. మ్యుటేషన్‌ను ఆమోదించేందుకు సొరకాయలపేట గ్రామ సచివాలయ వీఆర్వో యల్లయ్య రూ.9 వేలు లంచం డిమాండ్ చేశాడు. అంత ఇచ్చుకోలేనని రైతు పలుమార్లు ప్రాధేయపడగా రూ.5 వేలకు ఒప్పుకున్నాడు. వీఆర్వో వ్యవహారంతో విసిగిపోయిన మల్లయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు ఆ డబ్బు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నానని వీఆర్వోకు తెలుపగా శనివారం సచివాలయం వద్దకు రమ్మన్నాడు. సచివాలయంలో అతను లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీఆర్వో యల్లయ్యను నెల్లూరు ఏసీబీ కోర్టుకు తరలించినట్లు ఆయన తెలిపారు. దాడిలో ఏసీబీ సీఐలు మహమ్మద్ అలీ, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



మృతి చెందిన మహిళ

జమ్మలమడుగు, మార్చి 30: విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతిచెందింది. మండలంలోని గొరిగనూరు ఎస్సీ కాలనీకి చెందిన నీరుకట్టి రామసుబ్బమ్మ (50) వ్యవసాయ కూలీ. శనివారం సాయంత్రం సుబ్బరాయుడు అనే రైతు ఇంట్లో చప్పట బండలు కడుగుతూ ప్లగ్ బాక్స్‌ను పట్టుకుంది. దీంతో విద్యుదాఘాతానికి గురైంది. వెంటనే ఆమెను జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ విషయంపై అర్బన్ పోలీసులకు సమాచారం అందించినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. మృతురాలి భర్త హమాలీ కాగా, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

రూ.5 లక్షల నగదు స్వాధీనం

కమలాపురం రూరల్, మార్చి 30 : ఎన్నికల నిబంధనల్లో భాగంగా కమలాపురం సమీపంలోని పెట్రోలు బంకు వద్ద శనివారం రూ.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సరస్వతి తెలిపారు. ఆమె సమాచారం మేరకు... కడప నుంచి అనంతపురం వైపు వెళుతున్న కారును ఆపి తనిఖీ చేయగా ఆ మొత్తం పట్టుబడిందన్నారు. నగదు యజమాని అనంతపురానికి చెందిన వెంకటశేషారెడ్డి ఎలాంటి రసీదులు చూపపోవడంతో నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

15 బీర్ బాటిళ్ల పట్టివేత



పట్టుబడిన బీర్ బాటిళ్లు, నిందితుడితో పోలీసులు

కలసపాడు, మార్చి 30 : మండల కేంద్రంలో శనివారం ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని 15 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోరుమామిళ్ల సర్కిల్ సీఐ చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ అక్రమ మద్యం కలిగి ఉన్నా, తరలిస్తున్నా కఠిన చర్యలు తప్పవన్నారు. అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్నా, బెల్టుషాపులు నిర్వహిస్తున్నా పోలీసులకు తెలపాలని, తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు తెలియజేస్తున్న సీఐ చాంద్‌బాషా

వేంపల్లె, మార్చి 30: వేంపల్లె పట్టణంలో జరిగిన హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ చాంద్‌బాషా తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 24న నాగేంద్ర అనే వ్యక్తి శివ, నరసింహులు, శ్రీనివాసులుపై కత్తితో దాడి చేశాడు. కత్తిపోట్లకు గురైన నరసింహులు చికిత్స పొందుతూ ఈనెల 26వ తేదీన మృతిచెందాడు. శివ, శ్రీనివాసులు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ కేసులో నిందితుడు నాగేంద్రను శనివారం మధ్యాహ్నం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్ పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

వాల్మీకిపురం, మార్చి 30: పట్టణ సమీపంలోని పునుగుపల్లెకు చెందిన నరసింహులు కుమారుడు అరుణ్‌కుమార్(22) శుక్రవారం అర్ధరాత్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మ హత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. కదిరి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు.

నేడు పన్ను వసూలు కేంద్రం ప్రారంభం

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 30 : సెలవు దినమైనప్పటికీ ఆదివారం పన్ను వసూళ్లకు సంబంధించి ప్రత్యేక కౌంటరు ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ ప్రవీణ్‌చంద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ ఆదేశాల మేరకు 31వ తేదీలోపు పన్ను బకాయిలు చెల్లించేవారికి వడ్డీ మినహాయింపు లభిస్తుందన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ నెల 31న చివరి రోజు అని సూచించారు.

మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 30: ప్రస్తుతం ఎండ తీవ్రత అధికమవుతున్నందున ప్రభుత్వ అధికారులు జిల్లాలో మజ్జిగ కేంద్రాలు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. శనివారం నగర అధ్యక్షుడు షేక్ షాకీర్‌తో కలిసి స్థానిక పాతబస్టాండులోని కార్యాలయంలో వారు మాట్లాడారు. రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతోందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

కేంద్ర బలగాలతో కవాతు

పెండ్లిమర్రి, మార్చి 30: మండలంలోని కొండూరు, ఉలవలపల్లె, వెల్లటూరు గ్రామాలలో పెండ్లిమర్రి సీఐ నాగరాజు, ఎస్‌హెచ్‌ఓ సునీల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఘర్షణలకు తావిస్తే కేంద్ర బలగాలు ఎప్పటికి అప్రమత్తంగా ఉంటాయని సంఘ విద్రోహ శక్తులను ఉక్కుపాదంతో అణచివేస్తాయని హెచ్చరించారు. అలాంటి హెచ్చరికగా కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పూడికతో నిండిన కేసీ కాల్వలు


కేసీ కాల్వలో పేరుకుపోయిన మట్టి, చెత్తాచెదారం

చెన్నూరు, మార్చి 30 : మండల పరిధిలోని కేసీ ప్రధాన కాల్వ, ఉప కాల్వల్లో పేరుకుపోయిన పూడికను ఈ వేసవిలో తొలగించాలని కేసీ ఆయకట్టు రైతుల కోరుతున్నారు. చాలా ఏళ్ల క్రితం కాల్వల్లో పూడిక తొలగించారు. ఆ తరువాత దృష్టిపెట్టకపోవడంతో అటు ప్రధాన కాల్వ, ఇటు ఉప కాల్వల్లో పూడిక బాగా పేరుకపోయింది. దీంతో రెండు ప్రధాన కాలవ, ఉప కాల్వల్లో నిండుగా నీరు వచ్చినా పూర్తి అడుగు వరకు నీరు ప్రవహించడంలేదు. రకరకాల వ్యర్థాలతో కాల్వ అడుగుభాగం దాదాపు రెండు అడుగుల మేర పేరుకుపోయింది. ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట నుంచి ఇటు ఓబులంపల్లె చివరి ఆయకట్టు వరకు, అలాగే కడపలోని పాతకడప చెరువు వరకు కేసీ కాల్వ ప్రధాన కాల్వ, ఉప కాల్వ ఉంది. ఈ రెండు చోట్ల కేసీ కెనాల్ అధికారులు దృష్టి సారిస్తే మొత్తం పూడికను తొలగించవచ్చు. పైగా తొలగించిన పూడికను రైతులు పొలాలకు కూడా అందిస్తే అటు కేసీ ఆయకట్టు పొలాలు కూడా సారవంతం అవుతాయని రైతులు పేర్కొం టున్నారు. అలా కాకుండా పూడిక తీయకుండా అలాగే వదిలేస్తే కాల్వ ఏటా అటు పూడికతో, ఇటు వ్యర్థాలతో, గడ్డితో నిండిపోవడం, నీటి ప్రవాహానికి ఆటంకంగా మారడం తప్ప ఎలాంటి ఉపయోగం లేదని వారు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి పూడిక తొలగించాలని రైతులు కోరుతున్నారు.

కాల్వ అంతా పూడికే.. నీళ్లొస్తే వెళ్లేదెలా..?



కేసీ కాల్వలో ఎన్నో ఏళ్లుగా పూడిక తీసిన దాఖలాలు లేవు. ఎప్పుడో ఐదారేళ్లక్రింతం ఉపాధి హామీ పథకంలో పూడిక తొలగించారు. ఆ తరువాత కాల్వపై దృష్టి పెట్టనే లేదు. ఏదో చిన్న చిన్న గడ్డిమొక్కలు, తుంగను రైతుల ఒత్తిడి మేరకు తొలగించడం తప్ప ప్రధాన కాల్వ, ఉప కాల్వ పూర్తి స్థాయిలో పూడిక తొలగించి ఎన్నో ఏళ్లయింది. అధికారులు దృష్టి సారించి పూడిక తొలగిస్తే నీరు ఎలాంటి ఇబ్బంది లేకుండా పంట పొలాలకు సాఫీగా చేరే అవకాశం ఉంది.

- పిట్టి నరసింహులు, రైతు, గోపవరం, చెన్నూరు మండలం

అవినీతి పాలకులను సాగనంపుదాం

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, మార్చి 30: 'అవినీతి పాలకులను సాగనంపుదాం, ప్రజాపాలన తెచ్చుకుందాం' అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నగర పంచాయతీ పరిధిలోని టీడీ కాలనీ ఆర్ఎస్ రోడ్డు సొసైటీకాలనీలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డితో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. వైఎస్ జగన్ 2019 ఎన్నికల్లో అధికార దాహంతో ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలను నమ్మించి నట్టేట ముంచారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, ఓబయ్య, జంపాల నరసింహారెడ్డి, మండల కన్వీనరు రాఘవరెడ్డి, దివాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, ధర్మారెడ్డి, వాసుదేవరెడ్డి, ఎల్లారెడ్డి, సుబ్బరాయుడు, రామమునిరెడ్డి, శంకర్‌యాదవ్, మల్లేష్‌రాయల్, వేణుగోపాల్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, దాదిరామయ్య, నబీరసూల్, బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

టీడీపీని ఆదరించండి.. అభివృద్ధిని అందుకోండి

● చెన్నూరులో పుత్తా సరళమ్మ, శ్రీచైతన్య ఇంటింటి ప్రచారం

చెన్నూరు, మార్చి 30 : 'టీడీపీని ఆదరించండి.. అభివృద్ధిని అందుకోండి' అంటూ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సతీమణి పుత్తా సరళమ్మ, యువనేత పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి సతీమణి శ్రీచైతన్య, దివంగత టీడీపీ నేత పుత్తా జ్యోతిరెడ్డి సతీమణి పుత్తా శివకుమారి ప్రజలను అభ్యర్థించారు. చెన్నూరు అరుంధతీనగర్, సుగాలికాలనీ, బుడ్డాయపల్లె గ్రామాల్లో శనివారం సాయంత్రం బాబుతోనే భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరిగి టీడీపీకి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీ రావాలని కోరారు. మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పొట్టిపాటి ప్రతాప్ రెడ్డి, రాజేశ్వరమ్మ, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కుంచం రామక్రిష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, తెలుగు యువత అధ్యక్షుడు పాలగిరి సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

మూల్యాంకన విధుల కేటాయింపులో నిర్లక్ష్యం తగదు: యూటీఎఫ్



ఎంవీ క్రిష్ణారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు.. డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 30: పదోతరగతి మూల్యాంకన విధుల కేటాయింపులో నిర్లక్ష్యం తగదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాలెం మహేష్‌బాబు పేర్కొన్నారు. శనివారం పదోతరగతి పరీక్షల జిల్లా పరిశీలకుడు ఎంవీ క్రిష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ అనుభవం ఉండి ప్రతి ఏడాది మూల్యాంకనంలో పాల్గొంటున్న చాలా మంది ఉపాధ్యాయులకు మూల్యాంకన విధులు కేటాయించరాదన్నారు. తక్కువ అనుభవం కలిగిన వారికి మూల్యాంకన విధులు కేటాయిస్తూ డీఈఓ ఇచ్చిన ఉత్తర్వులు సవరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూల్యాంకనంలో జరిగిన అవకతవకలను వారి దృష్టికి తీసుకెళ్లి వాటిని సవరించే విధంగా డీఈఓకు తగిన సూచనలు ఇవ్వాలని కోరారు. సుదీర్ఘ అనుభవం, ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులకు ప్లస్ 2 ఉన్నత పాఠశాలల్లో పనిచేసే పీజీటీలు, సుదీర్ఘకాలంగా పదోతరగతి బోధిస్తున్నప్పటికీ వారికి మూల్యాంకనవిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. లాంగ్వేజీ పండితులు, గతంలో పదోతరగతి బోధించిన వారి సర్వీసును పరిగణనలోకి తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో జూనియర్లకు విధులు కేటాయించి సీనియర్లను పక్కన బెట్టడం తప్పిదాలను సవరించాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, 60 ఏళ్ల పైబడిన ఉపాధ్యాయులకు విధుల నుంచి మినహాయింపు కల్పించాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమణ, నాయకులు అనిల్‌కుమార్, బత్తుల చంద్రశేఖర్, సురేష్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, అమీర్‌బాషా పాల్గొన్నారు.

మెరుగైన వసతులు కల్పించాలి: ఏపీటీఎఫ్

మూల్యాంకన కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి కోరారు. శనివారం కడప నగరం డీఈఓ కార్యాలయంలో డీఈఓ అనురాధకు ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మూల్యాంకన విధులకు హాజరయ్యే ఉపాధ్యాయులకు చల్లని మంచినీటి వసతి, బెంచీలు, మహిళా ఉపాధ్యాయులకు సరిపడా మరుగుదొడ్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలన్నారు. 58 సంవత్సరాలు దాటిన ఉపాధ్యాయులను, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని, వికలాంగులకు విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. అసిస్టెంట్లుగా విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు డీఏ, డీఏలను చెల్లించాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర నాయకులు గురయ్య, జిల్లా నాయకులు నరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

'నీటి ఎద్దడిని నియంత్రించకపోతే ఆందోళన'

కడప (మారుతీనగర్), మార్చి 30: నగరంలో నీటి ఎద్దడిని నియంత్రించకపోతే ఆందోళన తప్పదని జాతీయ బీసీ మహాసభ జిల్లా కన్వీనర్ పీవీ రమణ హెచ్చరించారు. శనివారం జాతీయ బీసీ మహాసభ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరపాలక కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోని 41, 42, 43, 44 డివిజన్‌లలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఐదు రోజులకోసారి నీళ్లు వదులుతున్నారని, దీంతో వెంటనే స్పందించి ఆయా డివిజన్‌లకు కనీసం దినం మార్చి దినం అయినా నీటిని సరఫరా చేయాలని కోరారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

చెన్నూరు, మార్చి 30 : చెన్నూరు కొత్తరోడ్డులోని జీవై కాంప్లెక్స్‌లో నిర్వాహకుడు అన్వేష్‌రెడ్డి ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను శనివారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ అధ్యక్షుడు జీఎస్ భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దారిలో నిత్యం ఎంతో మంది రాకపోకలు సాగస్తుంటారని, ఇక్కడ వివిధ వాణిజ్య సముదాయాలు, మీసేవ కేంద్రాలు, బ్యాంకులు ఉండడంతో పనుల నిమిత్తం ప్రజలు రోజూ వచ్చిపోతుంటారన్నారు. వారందరికీ స్వచ్ఛమైన చల్లని నీటిని అందించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టారని అన్నారు.

రేపటి నుంచి యోగా శిక్షణ తరగతులు

(కడప - ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని పటేల్‌రోడ్డులో ఉన్న మిత్ర యోగా సెంటరులో 30 రోజుల పాటు నిర్వహించి యోగా శిక్షన తరగతులను రేపటి నుంచి ప్రారంభించనున్నట్లు యోగా నిపుణుడు డాక్టర్ కల్పన తెలిపారు. యోగా శిక్షణతో రోగనిరోధక శక్తి పెంచుకోవడంతో పాటు మానసిక వత్తిడి తగ్గించుకోవడం, బీపీ, షుగరు, ఒబెసిటి వ్యాధులకు పరిష్కారం ఉంటుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 5.45 నుంచి 7 వరకు మొదటి బ్యాచ్, రెండో బ్యాచ్ 8.30 నుంచి 10గంటల వరకు ఉంటుందన్నారు. వివరాలకు 9848861206, 7013238986 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

'మేనిఫెస్టోలో ఆచరణకు సాధ్యమైనవి మాత్రమే చేర్చాలి'

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 30:ముస్లిం మైనార్టీలకు సంబంధించిన పథకాల అమలులో 2024 ఎన్నికల మేనిఫెస్టోలో ఆచరణమైన వాటికి మాత్రమే చోటు కల్పించాలని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు కేసీ బాదుల్లా రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక హోచిమన్ భవన్‌లో 2024లో జరగబోయే సాధారణ ఎన్నికల మేనిఫెస్టోలో ముస్లిం మైనార్టీలకు సంబంధించిన సంక్షేమ పథకాలు విడుదల చేశారు. ఈసందర్భంగా బాదుల్లా మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు సబ్‌ప్లాన్ రూపొందించి అమలు చేయాలని కోరారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అమలయ్యేట్లు చూడాలన్నారు.

ఐదేళ్లలో ఒక్క డీఎస్సీనీ నిర్వహించని జగన్ ప్రభుత్వం


మాట్లాడుతున్న షేక్ సిద్దిక్

కడప (నాగరాజుపేట), మార్చి 30 : ఈ ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ఒక్క డీఎస్సీని కూడా నిర్వహించలేదని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనరు షేక్ సిద్దిక్, గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు పేర్కొన్నారు. శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 23 వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీ ఇస్తామని చెప్పి ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంలో నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులకు పరీక్ష రాసేందుకు తగిన సమయం ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఓటు అనే ఆయుధంతో ఓడించాలని పిలుపునిచ్చారు.

వెంటనే బకాయిలు చెల్లించాలి: ఆపస్



మాట్లాడుతున్న రామాంజనేయ ప్రసాద్

కడప (ఎడ్యుకేషన్), మార్చి 30: రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తామన్న బకాయిలు వెంటనే చెల్లించాలని ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయప్రసాద్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కడప నగరం ఆపస్ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్చి 30లోపు ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లిస్తామన్న బకాయిలన్నీ వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగే పదో తరగతి మూల్యాంకన కేంద్రాల్లో ఉపాధ్యాయులకు వేసవి దృష్ట్యా మెరుగైన సదుపాయాలు కల్పించాలని కోరారు. ఎన్నికల కమిషన్ అనుమతి పొంది వెంటనే డీఎస్సీ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, జిల్లా ఆర్థిక విభాగం కార్యదర్శి శ్రీనివాసులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

సోమసుందరేశ్వర స్వామి హుండీ లెక్కింపు

కడప (కల్చరల్), మార్చి 30: నగరంలోని గడ్డిబజార్‌లో గల సోమ సుందరేశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం శనివారం దేవదాయశాఖ ఆలయ ఈఓ ఎ.శ్రీధర్, ఆలయ ప్రధాన అర్చకుడు బి. చంద్రమౌళి శర్మ పర్యవేక్షణలో సాగింది. 2023 ఆగస్టు 28వ తేదీ నుంచి ఈనెల 30 వరకు స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు కానుకల ద్వారా హుండీలో సమర్పించింది రూ.44,337గా వివరించారు. సీకేదిన్నె గంగమ్మ దేవస్థానం ఈఓ సురేష్‌కుమార్‌రెడ్డి, ఆలయ అసిస్టెంట్ శివసాయిప్రసాద్ పాల్గొన్నారు.

పంటలకు ఏడుగంటల కరెంటు ఇచ్చి ఆదుకోవాలి

కమలాపురం రూరల్, మార్చి 30 : ఏడుగంటలు కరెంటు సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని టీడీపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక సబ్‌స్టేషన్‌లో ఏఈ చాంద్‌బాషాకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడు తూ గత నాలుగు రోజులుగా పెన్నానది పరివాహక ప్రాంతంలో రైతులకు ఇస్తున్న ఏడుగంటల కరెంటును 4 గంటలకు తగ్గించడం బాధాకరమన్నారు. దీని వల్ల పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. పంటలు కీలక దశలో ఉన్న సమయంలో ఇలా చేయడం సరికాదన్నారు. వెంటనే ఏడుగంటలు కరెంటు ఇవ్వాలని, లేదంటే రైతులు నష్టపోతారని, నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలన్నారు. ఒకవేళ అధికారులు పట్టించుకోకుంటే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దివాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శంకర్ యాదవ్ పాల్గొన్నారు.


మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రొద్దుటూరులో నిర్వహించిన ప్రజాగళం కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు అమీర్‌బాబు, హరిప్రసాద్, పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, పుత్తా నరసిహారెడ్డి తదితరులు

నందిపల్లె మాజీ సర్పంచు టీడీపీలో చేరిక

వేంపల్లె, మార్చి 30: మండలంలోని నందిపల్లె గ్రామానికి చెందిన వైసీపీ మాజీ సర్పంచు వీరలింగేశ్వరరెడ్డి శనివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కండువా వేసి ఆహ్వానించారు. నందిపల్లెకు చెందిన జిల్లా ఉపాధ్యక్షులు రామగంగిరెడ్డి ఆధ్వర్యంలో మాజీ సర్పంచు వీరలింగేశ్వరరెడ్డి ఆయన అనుచరులు ప్రొద్దుటూరుకు వెళ్లి చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, మండల కన్వీనర్ మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని ఆదరించండి

చక్రాయపేట, మార్చి 30: వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. శనివారం కల్లూరుపల్లె పంచాయతీలో ఎన్నికల ప్ర చారం నిర్వహించారు. పులివెందుల నియోజకవర్గ టీ డీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి సోదరుడు జోగిరెడ్డి, మండల ఇన్‌చార్జి తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి ఇంటింటి ప్రచారం ని ర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి కొరత లేకుండా సత్వర పరిష్కారం

● కెనాల్స్‌లో మట్టిని తొలగించండి ● నీటి చౌర్యం జరగకుండా ప్రత్యేక చర్యలు ● కమిషనర్ ప్రవీణ్‌చంద్


కాల్వలను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 30 : కడప నగరంలో నీటి కొరత లేకుండా సత్వర పరిష్కారం చూపాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ సిబ్బం దిని ఆదేశించారు. శనివారం మైలవరం డ్యాం నుంచి విడుదలవుతున్న 240 క్యూసెక్కుల నీటిని ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వల్లోని మట్టిని జేసీబీతో తొలగించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ముందుగా ఉప్పరపల్లె కెనాల్ వద్దకు చేరుకుని నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. అక్కడ నుంచి లింగంపల్లె వరకు వెళ్లే నీటి మార్గాన్ని, అలాగే రాళ్లవంక, బచ్చుంపల్లె, వాటర్‌గండి ప్రాంతాలను పరిశీలించారు. లింగంపల్లె చేరుకోవడానికి కెనాల్స్‌లో ఉన్న మట్టిని జేసీబీ డోజర్ల ద్వారా సత్వరం తొలగించాలని ఆదేశించారు. మైలవరం నుంచి నీటి ప్రవాహం ప్రాంతాన్ని డ్రోన్ కెమెరాల ద్వారా చిత్రీకరించాలన్నారు. గండి నుంచి లింగంపల్లె వరకు నీటి ప్రవాహం కోసం ట్రెన్స్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. నాలుగురోజుల్లో నీరు లింగంపల్లె చేరుకునేందుకు గండి వాటర్ వర్క్స్ నుంచి లింగంపల్లె వరకు షీట్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

'అధికారులు సమన్వయంతో పనిచేయాలి'

పులివెందుల టౌన్, మార్చి 30: సార్వత్రిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎ న్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేశులు పేర్కొన్నారు. శనివారం స్థానిక మినీ సెక్రటేరియట్ కార్యాలయంలో అబ్జర్వర్స్ టీం, ఎంసీసీ ఇ తర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ నియమావళిని తప్పకుండా అమలు చేయడంతో పా టు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. భద్రతపరంగా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో అధికారులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. చెక్ పోస్టుల వద్ద నిఘా పెంచాలని, ప్రతిరోజు వాహనాల తనిఖీ చేపడుతు న్నట్లు తెలిపారు. రూ.50వేలు తీసుకెళ్లవచ్చని, అయితే అందుకు సంబంధించిన పత్రా లు ఉండాలని, లేకుంటే కేసు నమోదు చేస్తామన్నారు.

ఆదాయపు పన్ను శాఖ నోటీసులు దుర్మార్గం: తులసిరెడ్డి

వేంపల్లె, మార్చి 30: లోక్‌సభ ఎన్నికల వేళ మోదీ ప్రభుత్వం ఆదాయపు పన్ను శాఖ ద్వారా కాంగ్రెస్, సీపీఐ తదితర విపక్షాలపై పన్ను ఉగ్రవాదానికి పాల్పడడం దుర్మార్గమని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కాంగ్రెస్, యువజన కాంగ్రెస్‌కు సంబంధించిన రూ.270కోట్ల మేరకు 11 బ్యాంకు ఖాతాలను స్తంభింపచేయడమే కాకుండా అందులో నుంచి ఆదాయపు పన్ను శాఖ రూ.135కోట్లు స్వాధీనం చేసుకుందన్నారు. అంతటితో ఆగక మళ్లీ రూ.1823కోట్లు కాంగ్రెస్ పార్టీకి రూ.11కోట్లు సీపీఐకి డిమాండ్ నోటీసులు పంపడం దారుణమన్నారు. ఎన్నికల వేళ ప్రత్యర్థి రాజకీయ పార్టీలను ఆర్థికంగా దెబ్బతీసి ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని ఇబ్బంది పెట్టాలన్న బీజేపీ దుష్టబుద్ధి స్పష్టమవుతోందన్నారు. ఐటీ శాఖ మోదీ చేతిలో కీలుబొమ్మగా మారిందని తులసిరెడ్డి ధ్వజమెత్తారు. ధ్రువకుమార్‌రెడ్డి, రామకృష్ణ, బాబు, సుబ్రమణ్యం, నరసింహారెడ్డి, అమర్, ఉత్తన్న, రాజా, సుబ్బరాయుడు, వేమయ్య, వినయ్, వెంకటేశ్, మహబూబ్ బాష తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పులివెందుల ప్రజలను మోసం చేసి రూ.కోట్లు సంపాదించారు

● పులివెందులలో నివాసం ఉంటా.. నమ్మకంతో పనిచేయండి: బీటెక్ రవి


మాట్లాడుతున్న బీటెక్ రవి

పులివెందుల టౌన్, మార్చి 30: నాయకులు, కార్యకర్తలు అభద్రత భావం, అపనమ్మకంతో పనిచేయవద్దని పార్టీపై, నాపై నమ్మకం ఉంచి పనిచేయాలని పులివెందుల టీడీపీ ఎ మ్మెల్యే అభ్యర్థి రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి) అన్నారు. పులివెందుల టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, టీడీపీ నాయకులు, కార్యకర్తలను కూడా ఎన్నో రకాలుగా ఇబ్బందులు పెట్టారని, అవన్నీ ఎదుర్కొ ని ఈరోజు మనమందరం నిలబడ్డామని పేర్కొన్నారు. పులివెందుల మున్సిపాలిటీలో నేను తిరిగినపుడు ప్రజలు కూడా మా ఓటును మేము వేసుకునే విధంగా ప్రశాంత పోలింగ్ జరిగే విధంగా చూడాలని వారు మమ్మల్ని కోరారన్నారు. పులివెందుల ప్రజలను అడ్డుపెట్టుకొని వైసీపీ వారు రూ.కోట్లు దండుకున్నారన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు ఉటుందన్నారు. గతంలో మున్సిపాలిటీలో వైసీపీ వారికి 75శాతం ఓట్లు వచ్చేవని, ఈ సారి ఆ విధంగా ఉండదని తెలిపారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ఈ సారి టీడీపీకి పట్టం కట్టాలనే ఆలోచన ఉన్నారన్నారు. ప్రశాంత పోలింగ్ కచ్చితంగా జరిపించే విధంగా చూస్తామన్నారు. ఇకపై నేను పులివెందులలో ఉంటానని నాయకులు, కార్యకర్తలకు ఏ టైం అయిన అందుబాటులోనే ఉంటానన్నారు. టీడీపీ నాయకులు సిద్దారెడ్డి, మదుసూదన్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, భరత్‌రెడ్డి, జోగిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, ప్రసాదరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మాబాష, కాశీంవలి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా జ్యువెలరీ కాటన్ శారీస్ మేళాకు విశేష స్పందన


ఎగ్జిబిషన్‌లో కొనుగోలు చేస్తున్న మహిళలు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 30 : కడప నగరం ఆర్ఎస్ రోడ్డు హౌసింగ్ బోర్డు కాలనీ నారాయణ పాఠశాల ఎదురుగా ఏర్పాటు చేసిన మా జ్యువెలరీ కాటన్ శారీస్ మేళాకు విశేష స్పందన లభించింది. 92.5 సిల్వర్ ఆభరణాల ప్రదర్శన ఖాదీ కాటన్, కంచి కాటన్, కరిష్మా కాటన్, ప్రింటెడ్, బెంగాలీ, మల్మాల్, నారాయణ్‌పేట్‌కాటన్‌తో పాటు డిజైనర్ శారీస్, డ్రెస్ మెటీరియల్స్, బెడ్‌షీట్స్, దివాన్ షీట్స్, ఫ్యాబ్రిక్స్‌వి అందుబాటులో ఉన్నాయి. నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు స్వప్నకృష్ణారెడ్డి కోరారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 30: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష కోసం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల అధ్యాపకుడు నూర్‌మహమ్మద్, నరేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు ఉంటే ఏప్రిల్ 5వ తేదీ లోపు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.400, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు రూ.100 అప్లికేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ఉచిత కోచింగ్‌కు వచ్చే అభ్యర్థులకు తెలుగు, ఇంగ్లీషు మీడియంలో మెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 9052791413 నంబరులో సంప్రదించాలని కోరారు.

దివ్యాంగులకు రంజాన్ తోఫా పంపిణీ

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 30: ఆంధ్రప్రదేశ్ మదర్‌థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో దివ్యాంగులకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. శనివారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో 50 మంది దివ్యాంగులకు రంజాన్ తోఫా అందజేశారు. ఈ సందర్భంగా మదర్‌థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్‌హుస్సేన్ మాట్లాడుతూ దివ్యాంగులు పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవడానికి రంజాన్ తోఫా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు, మహ్మద్‌బాష, వెంకటసుబ్బయ్య, హనుమంతు, అల్తాఫ్, భద్రుడు, వెంకటలక్ష్మి, కేశవలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జెండాలు వేరైనా అజెండా ఒకటే

రాష్ట్రం నిలవాలంటే కూటమి గెలవాలి ● అవినీతి, అరాచక ప్రభుత్వాన్ని గద్దెదించేందుకే పొత్తు
● జగన్ ఐదుసంవత్సరాల పాలనలో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి, జూమ్‌మీటింగ్‌లో ఉమ్మడి కార్యకర్తలకు దిశ నిర్దేశం ఇస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

బద్వేలు టౌన్, మార్చి 30 : మూడు పార్టీల జెండాలు వేరు కావచ్చు కానీ అజెండా ఒక్కటే నని, అవినీతి, అరాచక జగన్ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకే టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు పెట్టుకున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి తెలిపారు. శనివారం బద్వేలు పట్టణంలోని ఆర్‌ఆర్ కన్వెన్షన్ హాలులో టీడీపీ ఆధ్వర్యం లో కూటమి నేతల ప్రత్యేక ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ ఆత్మీయసమావేశంలో కూటమిలో భాగంగా పురందేశ్వరి జూమ్ మీటింగ్ ఉమ్మడి కార్యకర్తల తో సమావేశం నిర్వహించి దిశ నిర్దేశం ఇచ్చారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ రేపు జరిగే ఎన్నికల్లో ప్రజలు ఇచ్చే తీర్పు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుందన్నారు.ఉమ్మడి ఎంపీ అభ్యర్థిగా భూపేష్‌రెడ్డి, అలాగే బద్వేలు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా బొజ్జ రోశన్న పోటీ చేస్తున్నారని మీ ఆశీస్సులను వారికి ఉండాలని ఆమె అన్నారు. మూడు పార్టీలు జెండాలు వేరు కావచ్చు కానీ అజెండా ఒక్కటే నని, అదే సంక్షేమం, అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ అన్నారు. మోదీ ఒక వ్యక్తి కాదని, భారతదేశాన్ని విశ్వ గురువుగా మారుస్తున్న ఒక శక్తి అని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మూడుపార్టీల కలయిక చారిత్రక అవసరమన్నారు. అనంతరం కార్యకర్తలకు దిశ నిర్దేశం ఇచ్చారు. కాగా ఆత్మీయ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, బీజేపీ పార్లమెంటు కన్వీ నరు బొమ్మన సుబ్బరాయుడు, జనసేన జిల్లా కన్వీనరు సుంకర శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి, బద్వేలు నియోజకవర్గ అభ్యర్థి బొజ్జ రోశన్న, మాజీ ఎమ్మెల్యే విజ యమ్మ, టీడీపీ యువ నాయకుడు రితీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూరాష్ట్ర విస్తృత ప్రయోజనాల కోసం రాష్ట్ర అభివృద్ధి కోసం టీడీపీ, జనసేన బీజేపీ నేతలతో కలిసి ఎన్డీఏ కూటమి ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో భాగంగా సీట్లను కూడా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ అరాచక విధ్వంస పాలనలో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందని వారన్నారు. ఐదేళ్లుగా మద్యం, ఇసుక, మట్టి మాఫియాలో రాష్ట్రాన్ని పీడించుకుని తింటున్న జగన్ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. రాబోవు ఎన్నికల్లో పొత్తుదే గెలుపు ధర్మానిదే విజయకూటమి అని వారన్నారు.కార్యక్రమంలో మండలాల టీడీపీ, జనసేన,బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికలాంగులకు అన్నదానం


మానసిక వికలాంగులకు భోజనం వడ్డిస్తున్న నవజ్యోత్‌రెడ్డి

ముద్దనూరు మార్చి30:మండల పరిధి కోడిగాండ్ల పల్లె సమీపంలోని మానసిక వికలాంగుల(ఏసుకరుణాలయం)ఆశ్రమంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ నవజ్యోత్‌రెడ్డి నాన్నమ్మ చింతా సుభద్రమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించి, అన్నదాన కార్యక్రమం చేశారు.ఈ కార్యక్రమంలో అంజి, సుధాకర్, రమణ, ఆశ్రమ నిర్వాహకులు,తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం

మైదుకూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్


పథకాలను వివరిస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్

ఖాజీపేట, మార్చి 30: వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందని మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీలోని కుమ్మరకొట్టాలు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌6 పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు జనసేన ఇన్‌ఛార్జి మల్హోత్ర, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, టీడీపీ నాయకులు లక్ష్మీరెడ్డి, గోవిందురెడ్డి, శెట్టిపల్లె సిద్దారెడ్డి, చంద్రభాస్కర్‌రెడ్డి, జానకీరాం, రమేష్‌నాయుడు, క్రిష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్య, పుల్లయ్యనాయుడు, సుబ్బయ్య, క్రిష్ణారెడ్డి, మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ


చంద్రబాబుతో మాట్లాడుతున్న బొజ్జ రోశన్న, రితీష్‌రెడ్డి, విజయమ్మ

బద్వేలు, మార్చి 30: ప్రజాగళం కార్యక్రమానికి ప్రొద్దుటూరు పట్టణానికి విచ్చేసిన చంద్రబాబును శనివారం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి రోశన్న , టీడీపీ యువ నేత రితేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా బద్వేలు నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కలసికట్టుగా అందరూ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి రోశన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని చంద్రబాబు వారికి సూచించారు

వైసీపీకి రాష్ట్రంలో ఆదరణ లేదు

● బీజేపీ మండలాధ్యక్షుడు ధనిరెడ్డి కొండారెడ్డి



జమ్మలమడుగు, మార్చి 30: వైసీపీకి రాష్ట్రంలో ప్రజల ఆదరణ లేక వారి పత్రికలో తప్పుడు కథనాలు రాయిస్తున్నారని పెద్దముడియం బీజేపీ మండలాధ్యక్షుడు ధనిరెడ్డి కొండారెడ్డి విమర్శించారు. శనివారం జమ్మలమడుగులోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ వారి పేపర్‌ను అడ్డం పెట్టుకుని ప్రత్యర్థుల గురించి తప్పుడు కథనాలు ప్రచురించి రాజకీయ లబ్ధిపొందాలని చేసే ఎత్తుగడలు భ్రమేనన్నారు. దేవగుడి సోదరులపై తప్పుడు కథనాలు రాయించడం వైసీపీ నాయకులు, ప్రభుత్వానికి అర్హత లేదన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో అభివృద్ధి చేయలేనివారు దేవగుడి సోదరులను విమర్శించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాలూరు చంద్రశేఖర్‌రెడ్డి, కల్వటాల రాధారెడ్డి, మోహన్‌రెడ్డి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అయిదు గంటల కరెంటు సరఫరా చేయాలి

జమ్మలమడుగు, మార్చి 30: జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, చాపాడు మండలాలల్లో పెన్నానదికి ఆనుకుని ఉన్న గ్రామాల రైతులకు తాగు, సాగునీరు ఇబ్బందికరంగా ఉందని సర్పంచులు, రైతులు జమ్మలమడుగు బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు సర్పంచులు రామాంజనేయరెడ్డి, సుధాకర్‌రెడ్డి తెలిపారు. రైతులకు కరెంటు ఏడు గంటల నుంచి నాలుగు గంటలు మాత్రమే ఇవ్వడంతో ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతున్నట్లు ఆదినారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. రైతులు ఫోనులో సమస్యను ఆదినారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి కలెక్టర్‌తో మాట్లాడినట్లు వారు తెలిపారు. రైతులకు కనీసం అయిదు గంటల కరెంటు ఇవ్వాలని కలెక్టర్‌కు ఆయన మాట్లాడి ఒప్పించినట్లు వారు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, శివారెడ్డి, గురుశేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అక్రమ ఐటీ నోటీసులు ఉపసంహరించుకోవాలి

పోరుమామిళ్ల, మార్చి 30 : కాంగ్రెస్ పార్టీపై ఇచ్చిన అక్రమ ఐటీ నోటీసులు తక్షణమే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ బద్వేలు ఇన్‌చార్జ్ కమల్ ప్రభాస్ డిమాండ్ చేశారు. శనివారం పోరుమామిళ్లలో మాజీ ఎమ్మెల్యే కమలమ్మ స్వగృహంలో గిరినగర్ యూత్ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మిరెడ్డి, ప్రసాద్, రవి, శిఖామణి పాల్గొన్నారు.

భూ కబ్జాలకు సహకరిస్తున్న వీఆర్వోపై చర్యలు చేపట్టాలి : సీపీఐ

బద్వేలు, మార్చి 30: మున్సిపాలిటీ పరిధిలోని సి. కొత్తపల్లెలో వందల ఎకరాలు ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, అందుకుసహకరిస్తున్న వీఆర్వో జగదీశ్వర్ రెడ్డిపై చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం కొత్తపల్లెలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను సీపీఐ బృందం పర్యటించింది. అధికారులు స్పందించి కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, జిల్లా సమితి సభ్యులు రమణ, భరత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామలింగ చౌడేశ్వరీదేవి తిరుణాళ్ల

ఖాజీపేట, మార్చి 30: మండల పరిధిలోని కొమ్మలూరు గ్రామంలో ఘనంగా రామలింగ చౌడేశ్వరీదేవి తిరునాళ్ల నిర్వహించారు. శనివారం కొమ్మలూరు గ్రామ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

● **బండలాగుడు పోటీలు..:** రామలింగ చౌడేశ్వరీదేవి తిరునాళ్ల సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 12 జతల ఎద్దులు పాల్గొనగా అందులో మొదటి బహుమతి చెన్నూరు మండలం ఓబులంపల్లెకు చెందిన ఎన్.సతీష్‌రెడ్డి ఎద్దులకు రూ.30,116, రెండో బహుమతి ప్రొద్దుటూరు ఈశ్వర్‌నగర్‌కు చెందిన కేశవకు రూ.20,116, మూడో బహుమతి కడప ఖాదర్‌ఖాన్‌కొట్టాలకు చెందిన డి.భావశ్రీ రూ.10,116 కైవసం చేసుకున్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి

పెద్దముడియం, మార్చి 30 : అర్హత కలిగిన వారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో లక్ష్మీనరసింహ కోరారు. మండల పరిధిలోని గుండ్లకుంట గ్రామంలో వెలుగు పాఠశాల వద్ద ఓటు హక్కు విషయమై అవగాహన కార్యక్రమాన్ని ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభావతి, పంచాయతీ కార్యదర్శులు బషీర్‌బాషా, సుధీర్, సతీష్ కుమార్,నీలావతి, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కొండాపురం..: ప్రజలు ఎన్నికలలో నిర్భయంగా ఓటు వేయాలని కొండాపురం సీఐ వేణుగోపాల్, ఎస్ఐ యోగీంద్ర తెలిపారు.శనివారం మండలంలోని పి.అనంతపురం,తిమ్మాపురం,లావనూరు,పొట్టిపాడు,వెంకయ్యకాలువ గ్రామాలలో కేంద్రబలగాలతో కవాతు నిర్వహించారు. ఎవరైనా గొడవలు సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చంద్రబాబు సమక్షంలో పలువురు టీడీపీలో చేరిక


చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరుతున్న రాజుపాలెం, మైదుకూరు నేతలు మానికింది ఖాదర్‌బాషా, శెట్టిపల్లె సిద్ధారెడ్డి

రాజుపాలెం, మార్చి 30: ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రొద్దుటూరులో చంద్ర బాబు సమక్షంలో టంగుటూరు గ్రామానికి చెందిన బీసీ నాయకుడు మానికింది ఖాదర్‌బాషా పార్టీలో చేరారు. ఆయనకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అదే విధంగా చిన్నశెట్టిపల్లె గ్రామానికి చెందిన బాలమ్మగారి పొట్టులక్ష్మీరెడ్డి పార్టీలో చేరారు. ఆయనకు కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. మండలంలోని 15పంచాయతీల నుంచి దాదాపు 48 బస్సులు, సుమోలు, బైకుల ద్వారా వేలాది మంది కార్యకర్తలు ప్రొద్దుటూరుకు తరలివెళ్లారు. ముఖ్యంగా మహిళలు ఉత్సాహంగా వెళ్లడం విశేషం.

మైదుకూరు..: మైదుకూరు నియోజకవర్గంలోని పలువురు వైసీపీ నాయకులను చంద్రబాబు టీడీపీలోకి చేర్చుకున్నారు. శనివారం ప్రొద్దుటూరు పర్యటన నిమిత్తం వచ్చిన ఆయన టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో పార్టీ కండువా కప్పిచేర్పించుకున్నారు. టీడీపీలోకి చేరిన వారిలో ఖాజీపేట మండల మాజీ జడ్పీటీసీ ఇరగంరెడ్డి రామగోవిందరెడ్డి,ఎమ్మెల్యేరఘురామిరెడ్డిస్వగ్రామం అయిన చాపాడు మండలం నక్కలదిన్నెకు చెం దిన శెట్టిపల్లె నారాయణరెడ్డి, శెట్టిపల్లె నాగేశ్వరరెడ్డి, శెట్టిపల్లె సిద్ధారెడ్డి, శెట్టిపల్లె నందకిషోర్‌రెడ్డి, తప్పెట ఓబాల యపల్లెకు చెందిన లింగిరెడ్డి రాజారెడ్డి, నాగేశ్వరరెడ్డి ఉన్నారు.


శనివారం ప్రొద్దుటూరులో జరిగిన టీడీపీ రోడ్‌షోలో చంద్రబాబు, వరదరాజుల రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న కొత్తపల్లె ఎంపీటీసీ సౌభాగ్యమ్మ, వైసీపీ నేతలు వంగనూరు మురళీధర్‌రెడ్డి, కామిశెట్టి బాబు


శనివారం ప్రొద్దుటూరులో జరిగిన రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి, చిత్రంలో చంద్రబాబు, వరద, కొండారెడ్డి, సీఎం సురేశ్‌నాయుడు... హాజరైన మైదుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్